ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 04.02.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. బీఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ పై విచారణ పూర్తి చేశారు.

2. తొలిసారి తెలంగాణ పర్యటనకు వస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈరోజు మహబూబ్ నగర్ లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

3. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు శంకుస్థాపన చేస్తారు.

4. ఈరోజు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

---------------------------------

**స్పీకర్**

తెలంగాణ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో విచారణ పర్వం కొనసాగుతోంది. తాజాగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ రోజు విచారణను ముగించారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై స్పీకర్ సుదీర్ఘంగా వాదనలు విన్నారు. ఇప్పటికే స్పీకర్ ఇచ్చిన నోటీసులకు కడియం శ్రీహరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మరోవైపు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. సంజయ్ కుమార్ పార్టీ మారారు అనేందుకు సరైన ఆధారాలు లేవని

ఇప్పటికి ఆయన బీఆర్ఎస్ సభ్యుడిగానే కొనసాగుతున్నారని స్పీకర్ స్పష్టం చేశారు. దీంతో ఇప్పటివరకు క్లీన్ చీట్ పొందిన ఎమ్మెల్యేల సంఖ్య 8కి చేరింది. మరోవైపు కడియం శ్రీహరి విషయంలో స్పీకర్ ఎలాంటి తీర్పు ఇస్తారనేది ఆసక్తిగా మారింది.

**పీటీసీ – హైదరాబాద్**

--------------------------------

**నితిన్**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈరోజు మహబూబ్ నగర్ రానున్నారు. సభా ప్రాంగణం నుంచి మరిన్ని వివరాలు మా కరస్పాండెంట్ గోకులం రవికుమార్ యాదవ్ అందిస్తారు.

**వాయిస్ కాస్ట్**

**పీటీసీ – మహబూబ్ నగర్**

----------------------------------

**ముఖ్యమంత్రి పర్యటన**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికాసేపట్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పర్యటించనున్నారు. మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామంలో జరిగే పలు అభివృద్ధి పనుల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా 200 కోట్ల రూపాయలతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్ స్కూల్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం గూడూరులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

**పీటీసీ – నల్గొండ**

---------------------------

**సీఎస్ - బడ్జెట్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి రావాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావు నిన్న సచివాలయంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశంలో సూచించారు. కేంద్ర ప్రాయోజిత పధకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా జనాభా ప్రాతిపదికగా తెలంగాణాకు కనీసం 25 వేలకోట్ల రూపాయలు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు.

**డెస్క్**

-----------------------------

**వెబ్ సైట్**

రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి నిన్న సాయంత్రం సచివాలయంలో ప్రారంభించారు. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్ఫూహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని, సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులతో తల్లిదండ్రుల బంధాన్ని ఉపయోగించుకుని రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. రోడ్డు నిబంధనలను పాటించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులతో అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు.

**జీఎస్**

--------------------------------

**నామినేషన్లు**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు జరుగుతున్న ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ పర్వం నిన్నటితో ముగిసింది. 6వేల 701 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో, రాష్ట్రంలోని 2వేల 996 వార్డులకు గానూ.. 12వేల 993 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అభ్యర్థులు ఖరారు కావడంతో ఈరోజు నుంచి ప్రచార పర్వం ఊపందుకుంది. ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

**జీఎస్**

--------------------------------

**బండి సంజయ్**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని అత్యధిక స్థానాల్లో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే నగర అభివృద్ధి చేసి చూపెడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. నిన్న రాత్రి కరీంనగర్ లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లలో కేంద్ర మంత్రి పాల్గొని బీజేపీ అభ్యర్థుల పక్షాన ప్రచారం చేశారు. మెజార్టీ బిజెపి అభ్యర్థులను గెలిపించగానే.. మొదటగా నగరంలోని పెండింగ్ పనులన్నీ పూర్తి చేయిస్తామని అన్నారు.

**పీటీసీ – కరీంనగర్**

--------------------------------

**పొంగులేటి**

ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ పరిధిలో ఈ రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన రావణాసుర ప్రభుత్వం పోయి ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు. గెలిచిన తర్వాత పార్టీల రంగులు చూడబోమని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

**పీటీసీ - ఖమ్మం**

---------------------------------

**రేవంత్ మీటింగ్**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మంత్రులు, పార్టీ ముఖ్య నేతలతో కీలక భేటీ నిర్వహించారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆయన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అసంతృప్త నేతలను బుజ్జగించి, పాత-కొత్త నాయకుల మధ్య సమన్వయం కుదర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రులు తమకు బాధ్యతలు అప్పగించిన జిల్లాల్లోనే ఉంటూ క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**పీటీసీ - హైదరాబాద్**

---------------------------------

**పవన్ కల్యాణ్**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ నెల 7, 8వ తేదీల్లో పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారని జనసేన కేంద్ర కార్యాలయం వెల్లడించింది. బీజేపీ, జనసేన అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తారని పార్టీ తెలియజేసింది. పవన్ కల్యాణ్ ప్రచారం షెడ్యూల్, రూట్ మ్యాప్ త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

**డెస్క్**

------------------------------

**గుజ్జుల**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ...

**బైట్ - గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి**

**పీటీసీ - మంచిర్యాల**

-------------------------------

**కేటీఆర్**

రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారక రామారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిన్న నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మున్సిపల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై రెండేళ్లలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉందని, సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**డెస్క్**

-----------------------------------------

**ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం**

ఈరోజు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచడానికి, ముందస్తు గుర్తింపు, చికిత్సను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ఫిబ్రవరి 4న దీనిని నిర్వహిస్తారు. 2025 నుండి 2027 వరకు మూడు సంవత్సరాల పాటు సాగుతున్న గ్లోబల్ క్యాంపెయిన్‌లో భాగంగా క్యాన్సర్‌ను జయించాలనే లక్ష్యం కోసం మనమందరం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చేలా "United by Unique" అనేది ఈ యేడాది ఇతివృత్తంగా ఉంది. క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు గుర్తింపు, నివారణ పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన చికిత్స అందేలా చూడటం ఈరోజు ఉద్దేశ్యం.

**జీఎస్**

-------------------------------

**క్యాన్సర్ దినోత్సవం**

పొగాకు నియంత్రణతోనే కాన్సర్ నివారణ సాధ్యం అని టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. వరల్డ్ కాన్సర్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థల వద్ద నో స్మోకింగ్ జోన్ చేయాలని తాను ఇప్పటికే సుప్రీంకోర్టుతో పాటు రాష్ట్రపతికి సైతం లేఖ రాసినట్లు ఆకాశవాణికి వివరించారు.

**బైట్ - రఘునందన్**

**జీఎస్**

---------------------------------

**ఫేస్ బుక్ డే**

సోషల్ మీడియాలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాట్ ఫామ్ లో ఒకటైన ఫేస్ బుక్ 22 యేళ్లక్రితం సరిగ్గా ఇవాల్టి రోజున ప్రారంభమైంది. మార్క్ జుకర్‌బర్గ్ తన సహచరులతో కలిసి 'TheFacebook' పేరుతో ఈ సోషల్ మీడియా సైట్‌ను 2004 ఫిబ్రవరి 4వ తేదీన ప్రారంభించారు. మొదట కేవలం హార్వర్డ్ విద్యార్థుల కోసం మాత్రమే దీనిని రూపొందించారు. 2006 నుండి 13 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా ఈ సైట్‌లో చేరవచ్చని ప్రకటించడంతో ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందింది.

**జీఎస్**

------------------------------------

**పులి దాడి**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్పుగూడెం గ్రామ పరిసరాల్లో పులి ఓ ఆవుపై దాడిచేసి చంపేసింది. షారాజీపేట గ్రామానికి చెందిన దూడల శ్రీదర్‌కు చెందిన ఆవుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

**పీటీసీ - యాదాద్రి**

---------------------------------

**బ్యాక్ లాగ్**

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో 2011- 12 నుండి 2015-16 విద్యా సంవత్సరాల్లో బ్యాక్ లాగ్ విద్యార్థులకు చివరి అవకాశం కల్పించనున్నట్లు వర్సిటీ అధికారి డాక్టర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. వివిధ కారణాలతో కోర్సులు పూర్తి చేయలేకపోయిన విద్యార్థులు మిగిలిన పరీక్షలు రాయడానికి ఆలస్య రుసుం లేకుండా మార్చి 4వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చునని అన్నారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------------

**మేడారం తిరుగువారం**

ములుగుజిల్లా మేడారంలో తిరుగువారం సందర్భంగా ఈరోజు పెద్ద ఎత్తున భక్తులు మేడారానికి తరలివచ్చి సమ్మక్క సారలమ్మ లను దర్శించుకుంటున్నారు. కోయ పూజారులు వారి కుటుంబాలతో కలిసి తిరుగువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పీటీసీ - ములుగు**

----------------------------------

**అంతర్జాతీయ మానవ సౌభ్రాతృత్వ దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ మానవ సౌభ్రాతృత్వ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్కృతులు, మతాల మధ్య శాంతి, ఐక్యతను పెంపొందించడానికి ఐక్యరాజ్యసమితి ఈ రోజును గుర్తించింది. 2019 ఫిబ్రవరి 4న అబుదాబీలో కాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్, అల్-అజార్ గ్రాండ్ ఇమామ్ అహ్మద్ అల్-తయ్యబ్ కలిసి "ప్రపంచ శాంతి - సహజీవనం" అనే చారిత్రాత్మక పత్రంపై సంతకం చేశారు. ఈ సంఘటన జ్ఞాపకార్థం ఐక్యరాజ్యసమితి 2020లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.

**జీఎస్**

-----------------------------